చెత్తను ఇంటికొచ్చే ఆటోలోనే వేయాలి


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్

జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్

జగద్గిరిగుట్ట: చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా ఇంటికి వచ్చే ఆటోలోనే వేయాలని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ అన్నారు. గురువారం గాజులరామారం సర్కిల్ పరిధిలోని పలు కాలనీల్లో ఇంటింటికీ తిరుగుతూ ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేస్తే వచ్చే వ్యాధుల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు దాదాపు 80 శాతం ప్రజలు ఇంటికి వచ్చే ఆటోలోనే చెత్తను వేయడం వల్ల జీవీపీ పాయింట్లను కూడా ఎత్తివేశామని తెలిపారు. ఇలాగే మిగతా వారు కూడా అలవాటు పడాలని, లేదంటే ఒకటి, రెండు సార్లు చూసి నోటీసులు జారీ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీసీ మల్లారెడ్డి, ఏఎంఓహెచ్ మమత, శానిటరీ జవాన్ జిలానీ పాషా, చందర్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు వెంకటేష్, రాజు, కృష్ణమూర్తి, అభిషేక్, కాలనీ వెల్ఫేర్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గాజులరామారం డివిజన్‌లో ..

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ లెనిన్‌నగర్, శ్రీనివాస్ నగర్‌లలో చేపట్టనున్న అభివృద్ధి పనుల విషయమై కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ గురువారం పర్యటించారు. ఇటీవల నియోజకవర్గ అభివృద్ధికి రూ.10 కోట్ల నిధులు మంజూరు కాగా.. గాజులరామారం డివిజన్‌కు కోటి నిధులను కేటాయించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా శ్రీనివాస్‌నగర్, లెనిన్‌నగర్‌లలో నిర్మించనున్న నాలా, కమిటీహాల్, మార్కెట్ యార్డు స్థలాలను ఉప కమిషనర్ మల్లారెడ్డి, స్థానిక సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి ఆయన పరిశీలించారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను తెలుసుకున్న కమిషనర్ త్వరలోనే అభివృద్ధి పనులను చేపట్టి పరిష్కరిస్తామన్నారు.


శ్రీనివాస్‌నగర్‌లో పర్యటిస్తున్న జోనల్ కమిషనర్, ఉప కమిషనర్ తదితరులు

ప్రణాళికాబద్ధంగా నాలాల అభివృద్ధి

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్


లింక్ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: నియోజకవర్గంలోని నాలాలను క్రమ పద్ధతిలో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని, నాలాల అభివృద్ధి ద్వారా కాలనీల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ డివిజన్ గణేష్‌నగర్‌లో రూ.1.80 కోట్లతో నిర్మిస్తున్న నాలా బ్రిడ్జి పనులను గురువారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఈఈ లక్ష్మీ గణేష్, డీఈ పాపమ్మ, ఏఈ మల్లారెడ్డి, మాజీ కార్పొరేటర్ గౌరీష్, నేతలు దూదిమెట్ల సోమేష్ యాదవ్, సత్తిరెడ్డి, కిశోర్, యేసు, ఆంజనేయులు, రమణారెడ్డి, నజీర్, వెంకటేష్, అజయ్, బొడ్డు వెంకటేశ్వర్ రావు, వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.నర్సింహా రెడ్డి, సెక్రటరీ మురళీ గౌడ్, సభ్యులు, దుర్గారావు, లింగం యాదవ్, చంద్రమౌళి, సుదర్శన్, భాస్కర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

సూరారం డివిజన్ సంజయ్ గాంధీ నగర్‌కు చెందిన ఆర్.లక్ష్మి కి రూ.2 లక్షలు, జీడిమెట్ల డివిజన్ వెంకన్న హిల్స్‌కు చెందిన పద్మావతికి రూ.2 లక్షలు, సుభాష్ నగర్ డివిజన్‌కు చెందిన పి. నరసింహ రాజుకు రూ.3 లక్షల ఎల్‌ఓసీ పత్రాలను బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే వివేకానంద్ అందజేశారు.

లింక్ రోడ్డు ప్రారంభం

దుండిగల్ మున్సిపాలిటీ పరిధి బహదూర్‌పల్లి నుంచి బౌరంపేట రహదారిలో రూ.60 లక్షలతో నూతనంగా నిర్మించిన లింక్ రోడ్డును ఎమ్మెల్యే వివేకానంద్ ప్రారంభించారు. కార్యక్రమంలో దుండిగల్ మున్సిపల్ వైస్ చైర్మన్ పద్మారావు, కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, భరత్, సత్యనారాయణ, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు సంజీవ్ రెడ్డి, మేడ్చల్ జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ నాగరాజు యాదవ్, నాయకులు సగ్గిడి శ్రీను, మైసిగారి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సదుపాయాల కల్పనకు కృషి


ఎంఈవోను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

రంగారెడ్డినగర్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగు పరిచేందుకు కృషి చేస్తానని కుత్బుల్లాపూర్ ఎంఈఓ జెమిని ఎస్.ఎస్. కుమారి అన్నారు. గురువారం బాధ్యతలు చేపట్టిన ఆమెను పీఆర్టీయూ మండల అధ్యక్షుడు సుభాష్, కార్యవర్గ సభ్యుడు రాఘవేంద్రరెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సత్కరించారు. జంట సర్కిళ్ల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని ఆమె అన్నారు.

ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు


పనుల పరిశీలనలో పాల్గొన్న మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి

కుత్బుల్లాపూర్: ప్రధాన చౌరస్తాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామని మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం కొంపల్లి ఫ్లైఓవర్ పనుల విషయమై ఆయన ఎన్‌హెచ్–44 ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులు జరుగుతున్న ప్రాంతాల్లో భద్రతా చర్యలు చేపడుతూ వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఏసీపీ వెంట అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం


శంభీపూర్ రాజును సన్మానిస్తున్న ప్రజలు

దుండిగల్: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తన కార్యాలయంలో కలిసి తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను వివరించారు. సానుకూలంగా స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని సూచించారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కుత్బుల్లాపూర్: నిరుపేద ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరం లాంటిదని, పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. సుభాష్‌నగర్ డివిజన్ భాగ్యలక్ష్మి కాలనీకి చెందిన సారె సుమలతకు మంజూరైన రూ.1.50 ఎల్‌వోసీని గురువారం అందజేశారు. కార్యక్రమంలో రవీందర్ గౌడ్, బుచ్చిరెడ్డి, ఐలయ్య, జనార్ధన్, జగన్, కృష్ణారెడ్డి, జహీర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


ఎల్‌ఓసీ అందజేస్తున్న కూన శ్రీశైలంగౌడ్

సీపీఎం రాజీవ్ గృహకల్ప కార్యదర్శిగా బాలపీరు


బాలపీరు

నిజాంపేట్: నిజాంపేట్ రాజీవ్ గృహకల్ప సీపీఎం నూతన కార్యదర్శిగా బాలపీరు నియమితులయ్యారు. గురువారం ప్రగతి నగర్‌లోని సుందరయ్య భవన్‌లో బాచుపల్లి మండల కార్యదర్శి వెంకటరామయ్య అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బాలపీరు మాట్లాడుతూ గృహకల్పలో నెలకొన్న తాగునీటి ఎద్దడి, రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ స్తంభాల సమస్యల పరిష్కారానికి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన అన్నారు.

కాలనీలో అభివృద్ధి పనులు చేపట్టాలి

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ కౌసల్య కాలనీ కమిటీ సభ్యులు గురువారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీలో సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ తిరుపతిరెడ్డి, హరీష్ రెడ్డి, ప్రసాద్ రావు, లింగారెడ్డి, పద్మారావు, నాగేశ్వర్ రెడ్డి, గొల్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చెత్త తరలింపు రిక్షా అందజేత



జీడిమెట్ల: ఎస్.ఆర్.నాయక్ నగర్ కాలనీలో చెత్తను తరలించేందుకు మున్సిపల్ కార్మికులకు రిక్షా లేదు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకుడు భాస్కర్‌రెడ్డి వారి కోసం రిక్షా చేయించి గురువారం కాలనీ ప్రజల సమక్షంలో పారిశుద్ధ్య కార్మికులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బొబ్బా రంగారావు, బీఆర్ఎస్ నాయకులు పూర్ణచందర్‌గుప్తా, గుబ్బల లక్ష్మీనారాయణ, హరిబాబు, టీడీపీ నాయకులు వీరబాబు, కాలనీ పెద్దలు బొబ్బా ప్రసాద్, వెంకట శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

నమ్మించి రూ. 4.70 కోట్లతో పరార్


ఇంటి ముందు ధర్నా చేస్తున్న బాధితులు

- చిట్టీల పేరుతో దంపతుల టోకరా
- నిందితుల ఇంటి వద్ద ధర్నా చేసిన బాధితులు

కుత్బుల్లాపూర్: చుట్టుపక్కల వారితో కలివిడిగా ఉంటూ వచ్చారు. చిట్టీలు వేస్తే లక్షాధికారులు అవుతారని నమ్మించారు. ఇక అంతే భార్యాభర్తలు కలిసి చిట్టీల పేరుతో కోట్ల రూపాయలకు శఠగోపం పెట్టి పరారయ్యారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వెంకటేశ్వరనగర్ రోడ్డు నెంబర్ –2 లో భార్యాభర్తలు మేకల నాగమణి, నాగమయ్య నివసిస్తున్నారు. నాగమయ్య ఓ ఫార్మా కంపెనీ ఉద్యోగం చేస్తుండగా.. నాగమణి చిట్టీల వ్యాపారం నిర్వహిస్తూ ఉండేది. 12 ఏళ్లుగా లక్ష రూపాయలు మొదలుకొని రూ.20 లక్షల వరకు చిట్టీలు నిర్వహిస్తూ వస్తూ ఉండేది. నాగమణి దంపతులు ఏప్రిల్ రెండవ వారం నుంచి కనిపించకుండా పోయారు. వారి కోసం వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో బాధితులు తొలుత జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితులు ఎక్కువ మొత్తం ఉండటంతో పాటుగా పోగొట్టుకున్న డబ్బు నాలుగు కోట్లకు పైగా ఉండటంతో ఈఓడబ్ల్యూలో కేసు నమోదైంది. ఏప్రిల్ 16న కేసు నమోదు అయినప్పటికీ నేటి వరకు తమకు ఎటువంటి న్యాయం జరగలేదని బాధితులు గురువారం పరారైన చిట్టీల వ్యాపారి ఇంటి వద్ద నిరసనకు దిగారు. పోలీసులు సదరు భార్యాభర్తలను అదుపులోకి తీసుకొని తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

నాలా ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి


కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న ముదిరాజ్ సంఘం సభ్యులు

నిజాంపేట్: బాచుపల్లి పెద్ద చెరువు నాలా ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని గురువారం కార్పొరేషన్ కమిషనర్ సౌజన్యకు ముదిరాజ్ సంఘం సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం నాయకులు మాట్లాడుతూ.. రెడ్డి ల్యాబ్స్ నుంచి ప్రణీత్ ఆంటీల, బ్లాక్ డైమండ్ కాలనీ, రెయిన్‌బో కాలనీ మీదుగా పెద్ద చెరువులోకి వచ్చే నాలా ఆక్రమణలకు గురైందని వివరించారు. దీంతో పెద్ద చెరువులోకి వర్షపునీరు చేరే మార్గం లేకుండా పోయిందని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. పెద్ద చెరువులోకి వచ్చే నాలాను బాచుపల్లి వైపు నుంచి కాకుండా మల్లంపేట్ వైపు మారుస్తూ చేపట్టిన పైపులైన్‌ను తక్షణమే తొలగించాలన్నారు. ముదిరాజ్‌లకు జీవనాధారంగా ఉన్న పెద్ద చెరువును పరిరక్షించేందుకు పెద్దనాలాను పునరుద్ధరించి భవిష్యత్ తరాలకు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



చింతల్: హైదరాబాద్ కమిషనర్ సీవీ ఆనంద్‌ను గురువారం నేషనల్ యాంటీ క్రైమ్ అండ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు చెరుకు రమేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్గనైజేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను వివరించారు. సంస్థ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రంగా శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర ఉమెన్ సెల్ ఉపాధ్యక్షురాలు శిరీష, సభ్యులు పద్మావతి, జాజుల నర్సింగరావు బత్తుల సాయి తదితరులు ఉన్నారు.

దుండిగల్‌లో ‘స్వచ్ఛతా హీ సేవ’


నృత్యం చేస్తున్న విద్యార్థులు

దుండిగల్: దుండిగల్ మున్సిపల్ పరిధిలో ‘స్వచ్ఛతా హీ సేవ’ కార్యక్రమం కొనసాగుతుంది. ఇందులో భాగంగా గాగిలాపూర్ తండా డ్వాక్రా స్వయం సహాయక సంఘాల మహిళా గ్రూప్ సభ్యులతో ప్లాస్టిక్ బ్యాన్‌లో భాగంగా జ్యూట్ బ్యాగులు తయారు చేయడంపై అవగాహన కల్పించారు. అదే విధంగా పాఠశాల విద్యార్థులతో పరిసరాల పరిశుభ్రతపై పాటలు, నృత్యాలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కమిషనర్ సత్యనారాయణ రావు, ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ పి సాత్విక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచందర్, మహిళా రిసోర్స్ పర్సన్ శాంత, వార్డు అధికారులు రవీందర్, ప్రవీణ్, రమేష్, జవాన్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కుత్బుల్లాపూర్: నేషనల్ హైవే–44 విస్తరణ పనుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తనుందని కొంపల్లి సెక్షన్ ఏఈ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ అపర్ణ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అపర్ణ పామ్‌గ్రోవ్, వేంకటేశ్వర కాలనీ, దేవేందర్ కాలనీ, మికాసా స్టెర్లింగ్, అమర్ రోడ్డు, సెంట్రల్ పార్కు, 11కేవీ జీబీఆర్ ఫీడర్ పరిధిలో రిలయెన్స్ పెట్రోల్ బంక్, హిల్టాన్ టొబాకో, సంగం రెడ్డి గొడౌన్స్, 11కేవీ కొంపల్లి ఫీడర్ పరిధిలో కుమ్మరి బస్తీ, మున్సిపల్ కార్యాలయ ప్రాంతం, ఆంధ్రాబస్తీ, సెంట్రల్ పార్కు, 11కేవీ ధోలారీ ధనీ ఫీడర్ పరిధిలో ఎస్ఎస్ఆర్ ఫంక్షన్ హాలు, శ్రీకాంత్‌రెడ్డి ఎస్టిమా, పోచమ్మగడ్డ ప్రాంతాలు, 11కేవీ నూజివీడు ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో సైతం విద్యుత్ సరఫరా ఉండని ఏఈ తెలిపారు.

కట్టు కాల్వను పరిశీలించిన ‘హైడ్రా’


అధికారులకు కబ్జాలపై వివరిస్తున్న స్థానికులు


వృథాగా పోతున్న నీరు

సుభాష్‌నగర్: దుండిగల్ మున్సిపల్ బహదూర్‌పల్లిలో కట్టు కాలువపై నిర్మించిన హైమార్క్, అయోధ్య విల్లాను గురువారం హైడ్రా అధికారులు ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. గ్రామంలో 39 ఎకరాల విస్తీర్ణంలో బొబ్బాఖాన్ చెరువు, దిగువ భాగాన రెండు కట్టు కాల్వలు ఉన్నాయి. వీటిని పూడ్చివేసి నిర్మాణాలు చేపట్టడంతో ఇటీవల కురిసిన వర్షాలకు విల్లాలు మునిగిపోయాయి. దీంతో వర్షం పడినప్పుడల్లా స్థానికంగా కొనుగోలు చేసి నివాసం ఉంటున్న వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెరువు ఎగువ భాగాన కొన్ని నిర్మాణాలు చేపట్టడంతో ఆ నిర్మాణాలు మునగకుండా ఉండడానికి అలుగు వద్ద కొంత రాళ్లు తీసివేశారు. దీంతో 24 గంటల పాటు చెరువులోని నీరు వృథాగా పోతున్నాయి. ఈ విషయమై హైడ్రా అధికారులు స్థానికుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఇక ఏం చర్యలు చేపడతారో చూడాలి.

తాగునీటి వృథాను అరికట్టలేరా?

- పైపులైన్ పగలడంతో 15 రోజులుగా వృథాగా పోతున్న వైనం
- పట్టించుకోని వాటర్ వర్క్స్ అధికారులు


సాయినగర్ వెస్ట్ ప్రాంతంలో పైపులైన్ లీకేజీతో వృథాగా పోతున్న తాగునీరు

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఆయా ప్రాంతాల్లో తాగునీరు వృథాగా రోడ్లపై పారుతుంది. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా కాలనీల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఒకపక్క నీటి సమస్యతో ప్రజలు ఆయా ప్రాంతాల్లో అల్లాడుతుంటే 15 రోజులుగా తాగునీరు రోడ్డుపై పారుతున్న అధికారులు అటు వైపు కన్నెత్తి చూడటం లేదు. సింబలిక్‌గా ప్లాస్టిక్ సింబల్స్ ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ ప్రధాన రహదారిలోని విజయ డయాగ్నోస్టిక్ సెంటర్ ముందు 15 రోజులుగా 8 ఇంచులా మెయిన్ పైపులైన్ పగిలి తాగునీరు వృథాగా పోతుంది. పైపులైన్ పగిలి మంచి నీరు వృథాగా పోతుందని పలువురు వాటర్ వర్క్స్ మేనేజర్ తేజ దృష్టికి తీసుకెళ్లారు. అయినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారు వాపోతున్నారు. ఈ పైపులైన్ ద్వారా వచ్చే తాగునీరు ముందుగా స్టోరేజ్ చేసి రోజు వారీగా ఆయా ప్రాంతాలకు సరాఫరా చేస్తుంటారు. ఈ పైపులైన్ ద్వారా వచ్చే నీరు ఒక్కరోజు ఆగిపోయిన వివిధ ప్రాంతాలకు తాగునీటి సరాఫరా ఆగిపోతుంది. అలాంటి పైపులైన్ పగిలినా అధికారులు ఎందుకు స్పందించడం లేదని కాలనీల వాసులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై సిబ్బందిని అడిగితే.. ప్రధాన మంచినీటి పైపులైన్ కావడంతో మరమ్మతులు చేయడానికి ఒక్క రోజు పడుతుందని, దీని వల్ల నీటి సరఫరా చేసేందుకు సాధ్యం కాదన్నారు. త్వరలో చేస్తామని చెప్పారు. వారు చెప్పి వారం గడుస్తున్న మంచినీటి పైపులైన్‌కు మరమ్మతులు మాత్రం చేపట్టలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఆల్విన్‌కాలనీ డివిజన్ సాయినగర్‌లో..

కూకట్‌పల్లి: ఆల్విన్‌కాలనీ డివిజన్‌లోని సాయినగర్ వెస్ట్ ప్రాంతంలో మంచినీటి పైపులైన్ లీకేజీతో ప్రతి రోజు తాగునీరు వృథాగా రోడ్లపాలవుతుంది. మెట్రో వాటర్‌వర్క్స్ అధికారులు మంచినీటి లీకేజీ విషయంలో సమయానుకూలంగా మరమ్మతులు చేపట్టకపోవడం వల్లే నీరు వృథా అవుతుందని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి నీటి లీకేజీని అరికట్టాలని పలువురు కోరుతున్నారు.




ఓల్డ్ బోయిన్‌పల్లి విజయ డయాగ్నోస్టిక్ సెంటర్ దగ్గర పైప్‌లైన్ పగిలి వృథాగా పోతున్న తాగునీరు

పోరాట స్ఫూర్తికి ప్రతీక ఐలమ్మ

కుత్బుల్లాపూర్: భూమి కోసం, భుక్తి కోసం వెట్టిచాకిరీ విముక్తి కోసం దొరలు, రజాకార్లపై పోరాడిన ఐలమ్మ.. పోరాట స్ఫూర్తికి ప్రతీక అని పలువురు అన్నారు. చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా రజక సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆమె చిత్రపటాలు, విగ్రహాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నేటి యువత ఆమె స్ఫూర్తితో హక్కులను సాధించుకునేందుకు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.


బౌరంపేట్‌లో ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి


భూదేవి హిల్స్‌లో రజక సంఘం ఆధ్వర్యంలో..


నిజాంపేట్‌లో రజక సంఘం ఆధ్వర్యంలో..


జగద్గిరిగుట్టలో నివాళులర్పిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకుడు ఐలయ్య